సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 12 । డిసెంబర్ । 2024



ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. - 8లో



రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొరముట్ల అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.140	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 144 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	562	562



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 67.340 కిలోలు

న్యూస్‌రీల్

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం



నాదనవీధిలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

రాయచోటి అర్బన్ : పారిశ్రామికవేత్త అదానితో సెకీ చేసుకున్న ఒప్పందాలన్నింటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను సేకరించి బుధవారం నడిరోడ్డులో వాటిని దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్‌చార్జీలు, ఇంధనపు చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో నలభైశాతం ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. అదానీతో సెకీ చేసుకున్న ఒప్పందాలన్నీ ముడుపులతో కూడిన ఒప్పందాలని చెబుతున్న కూటమి నేతలు వాటిని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజులు, రామచంద్ర, మాధవ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

కడప రూరల్ : రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి కుడా (కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. రూపానందరెడ్డితో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రమాణం చేయించారు. ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్య, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, అరవ శ్రీధర్, రాష్ట్ర ఖాదీ బోర్డ్ చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అభ్యంతరాల స్వీకరణ

రాయచోటి టౌన్ : షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు అభ్యంతరాలపై వినతులు సమర్పించేందుకు జనవరి 9వ తేదీ వరకు గడువు ఉందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. వినతులను విజయవాడలోని గిరిన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఉన్న ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో గానీ లేదా అన్నమయ్య జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చన్నారు. వివరాలకు 9440256697 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

చదువు చెప్పలేం!

- జిల్లాలో అంగన్‌వాడీలపై పెద్దల అక్షరాభ్యాస భారం
- 1,376 కేంద్రాల పరిధిలో 13,767 మంది గుర్తింపు
- చదువు చెప్పేందుకు ఇచ్చే ఖర్చు నెలకు రూ.1,500
- ఇప్పటికే యాప్‌లతో యాతన

అక్షరాభ్యాస వివరాలు

మండలం	నిరక్షరాస్యులు	వీటీలు
సంబేపల్లె	425	42
చిన్నమండెం	406	41
రామాపురం	345	34
రాయచోటి	234	23
టి.సుండుపల్లె	505	51
వీరబల్లి	500	50
ఎల్ఆర్‌పల్లె	395	40
గాలివీడు	395	40
పెనగలూరు	608	60
పుల్లంపేట	560	56
రాజంపేట	600	60
చిట్వేలి	575	58
నందలూరు	475	48
రైల్వేకోడూరు	640	64
ఓబులవారిపల్లె	605	60
కలకడ	480	48
పెద్దమండ్యం	348	35
బి.కొత్తకోట	450	45
పీటీ సముద్రం	525	52
పీలేరు	605	60
కురబలకోట	295	30
తంబళ్లపల్లె	487	49
గుర్రంకొండ	365	30
వాల్మీకిపురం	345	34
నిమ్మనపల్లె	325	33
మదనపల్లె	568	57
రామసముద్రం	440	44
ములకలచెరువు	470	47



వలంటీర్ టీచర్ విధులపై బి.కొత్తకోటలో అంగన్‌వాడీల ధర్నా (ఫైల్)

బి.కొత్తకోట : అసలే యాప్‌ల భారం, కేంద్రాల నిర్వహణతో సతమతమవుతున్న అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం మరో భారం మోపింది. పెద్దలకు అక్షరాలు నేర్పించే భారం అంగన్‌వాడీ కార్యకర్తలపై పెట్టింది. వారిని కొత్తగా వలంటరీ టీచర్లు (వీటీ)గా నామకరణం కూడా చేసేసింది. దీనితో ఈ భారం మేం మోయలేం..అక్షరాభ్యాస విధుల నుంచి తప్పించండి అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు గళమెత్తుతున్నారు. దీంతో ఈనెల 15 నుంచి ప్రారంభం కావాల్సిన అక్షరాభ్యాస కార్యక్రమం మొదలవుతుందా లేదా అన్న సందిగ్ధత నెలకొంది.

అటు యాప్‌లు.. ఇటు పిల్లలు

అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ప్రతి రోజూ యాప్‌ల భారం మోపింది. ప్రతి కేంద్రం నుంచి రోజూ వివరాలను యాప్‌లలో నమోదు చేయాలి. కొన్ని విషయాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేశాక యాప్‌లో వివరాలు పెట్టాలి. దీంతోపాటే కేంద్రాల్లో పిల్లలకు చదువు చెప్పడం, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం జరుగుతోంది. బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, టీహెచ్ఆర్–ఎఫ్ఆర్ఎస్, ఫేస్‌యాప్, మిల్క్‌యాప్‌లను రోజూ నిర్వహించాలి. ఇన్ని విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీలనే వలంటీర్ టీచర్లుగా ఎంపిక చేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చేది రూ.1,500

వయోవృద్ధులకు అక్షరాలు నేర్పించేందుకు ప్రభుత్వం ఒక్కో అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో నెలకు చేయనున్న ఖర్చు రూ.1,500. కేంద్రాలకు పక్కా భవనాలు ఉండటంతో నిరక్షరాస్యులను అక్కడికి రప్పిస్తారు. దీనికోసం నిర్వహణ ఖర్చుల కింద ప్రభుత్వం నెలకు రూ.1,000 చెల్లిస్తుంది. అలాగే నిరక్షరాస్యుల కోసం చార్టులు, చాక్‌పీసులు, బోర్డు, క్యాలెండర్లు, పలకలు, రిజిస్టర్ కోసం నెలకు రూ.500 చెల్లిస్తారు. ఇది దేనికి సరిపోతుందో ప్రభుత్వానికే తెలియాలి. మూడు నెలల పాటు చెల్లించే ఈ నిధులతో అక్షరాభ్యాస లక్ష్యాలను సాధించాల్సి ఉంది.

1,376 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు

జిల్లాలో 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో పక్కా భవనాలు కలిగిన 1,030 అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించారు. వీటి పరిధిలో నిరక్షరాస్యులైన 13,767 మంది వయో వృద్ధులను గుర్తించారు. వీరికి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చదువు చెప్పి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి. ఈ బాధ్యతలను 1,376 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు అప్పగించారు. వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పాఠశాల గడువు ముగిశాక పెద్దలకు అక్షరాలు చెప్పించే విధులు నిర్వహించాలి. డిసెంబర్ 15 నుంచి మార్చి 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగించి లక్ష్యాలను సాధించాలి.

మమ్మల్ని తప్పించండి

వలంటీర్ల టీచర్ల బాధ్యతల నుంచి తమను తప్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ వారం క్రితం బి.కొత్తకోటలో మూడు మండలాల కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కొత్తగా అప్పగించే విధులను నిర్వర్తించలేమని స్పష్టం చేస్తూ వినతిప్రతం కూడా అందజేశారు. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలకే పరిమితం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీలు ఈనెల 15 నుంచి విధుల నిర్వహణకు సిద్ధమవుతారా లేదా అన్నది వేచి చూడాలి.

కలెక్టర్ దృష్టికి తెచ్చాం

అక్షరాభ్యాస విధులు తమకు వద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న డిమాండ్‌ను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయమై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. మూడునెలలు పూర్తయ్యాక తర్వాత అక్షరాభ్యాస కార్యక్రమం అమలుపై కలెక్టర్ నిర్ణయం తీసుకునే వీలుంది. ఈనెల 15 నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది.

- రమాదేవి, ఐసీడీఎస్ పీడీ, రాయచోటి

టీచర్ల సమ్మె.. పట్టని ప్రభుత్వం!

- సమ్మెబాటలో గిరిజన గురుకులం పాఠశాల ఉపాధ్యాయులు
- ప్రిన్సిపాళ్లే టీచర్లుగా మారిన వైనం
- విధుల్లో చేరాలని టీచర్లకు షోకాజ్ నోటీసులు
- నిలిచిపోయిన విద్యాబోధన.. పూర్తి కాని సిలబస్
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మదనపల్లె సిటీ : మదనపల్లె గిరిజన గురుకులంలో 3వ తరగతి నుంచి 10 వతరగతి వరకు 130 మంది విద్యార్థులున్నారు. వీరందరికి ప్రిన్సిపాల్ రంగనాయకులు ఒక్కరే పాఠాలు బోధిస్తున్నారు. కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రం పాఠాలు చెబుతారు. మిగిలిన తరగతుల వారు ఐఎఫ్‌సీ ప్యానెల్స్ ద్వారా పాఠాలు చూస్తున్నారు.

తంబళ్లపల్లె గిరిజన గురుకులంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 80 మంది విద్యార్థులున్నారు. వీరందరికి ప్రిన్సిపాల్ షబనా ఒక్కరే పాఠాలు బోధిస్తున్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి.

జిల్లాలో గిరిజన గురుకుల ఉపాధ్యాయులు సమ్మెబాటతో బోధనకు ఆటంకం ఏర్పడింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండగా.. ప్రభుత్వం మాత్రం వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండా వెంటనే విధుల్లో చేరాలని షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తమ డిమాండ్ల సాధించే వరకు విధుల్లో చేరమని ఉపాధ్యాయులు తేల్చిచెప్పారు. దీంతో గిరిజన గురుకులంలో విద్యాబోధన చతికిలపడింది. ప్రభుత్వ నిర్లిప్తత వల్ల సిలబస్ పూర్తి చేసి రివిజన్‌కు సన్నద్ధం కావాల్సిన సమయంలో పాఠాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 68 మంది టీజీటీలు సమ్మె చేస్తున్నారు.

ప్రిన్సిపాళ్లతో విద్యాబోధన

జిల్లాలోని గిరిజన గురుకులాల్లో ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లు పాఠాలు చెప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. కేవలం పదో తరగతి విద్యార్థులకు బోధిస్తూ మిగిలిన 3 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌సీ ప్యానల్స్ ద్వారా విద్యాబోధన కొనసాగుతోంది.

మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గిరిజన గురుకులాల్లో తమ బిడ్డల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మిగిలిపోతున్నాయి. ఉపాధ్యాయులు లేకపోవడంతో, విద్యాబోధన కుంటుపడటం, సరైన భోజన వసతి లేకుండా పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటీవల మదనపల్లె గిరిజన గురుకులంలో జరిగిన మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు గిరిజన అధికారులు, ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇలాగే ఉపాధ్యాయులు లేకపోతే టీసీలు ఇస్తే మరో పాఠశాలలో చేరుస్తామని చెప్పారు. పిల్లల భవిష్యత్తు పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకుల అధికారుల విచిత్ర వైఖరి

కాంట్రాక్టు ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండటంతో తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 43 మందిని కేటాయించారు. అయితే వారు కూడా ఇప్పటి వరకు గురుకులాల్లో చేరలేదు. దీంతో బోధన బ్రేక్ పడింది. ప్రభుత్వం స్పందించి గిరిజన గురుకుల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



మదనపల్లెలోని గిరిజన గురుకులంలో విద్యా బోధన చేస్తున్న ప్రిన్సిపాల్ రంగనాయకులు

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకులాలు

మండలం	ప్రస్తుతం బోధిస్తున్న వారు	విద్యార్థులు
మదనపల్లె (బాలురు)	ప్రిన్సిపాల్	130
పీలేరు (బాలురు)	ప్రిన్సిపాల్	100
సుండుపల్లి	ఇద్దరు ఉపాధ్యాయులు	130
రాయచోటి (బాలురు)	ప్రిన్సిపాల్	230
రాయచోటి (బాలికలు)	ప్రిన్సిపాల్ మరో ఇద్దరు, ఉపాధ్యాయులు	400
కె.వి.పల్లి (బాలికలు)	ఒక్క ఉపాధ్యాయుడు	200
తంబళ్లపల్లె	ప్రిన్సిపాల్	80

(రాయచోటి బాలుర గురుకులం ప్రిన్సిపాల్ సుండుపల్లికి ఇన్‌చార్జిగా ఉన్నారు. పీలేరు బాలుర గురుకులం ప్రిన్సిపాల్ కె.వి.పల్లి ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు)

తరుగుతున్న జ్ఞాపకం!

జ్ఞాపకాలే మనిషి జీవనానికి ప్రాణం..మనల్ని నడిపించేవి ఆ జ్ఞాపకాలే.. అవే తుడిచిపెట్టుకుపోతే? అప్పుడే చేసిన పని గుర్తు లేకపోతే? కన్నబిడ్డల్ని సైతం పోల్చుకోకపోతే ? అసలు మనెవరో మనకే ఎరుకలేకపోతే? ఆ జీవితం ఎంత దుర్భరమో ఊహించుకోవడమే కష్టం. మతిమరుపు(డిమోన్షియా) రుగ్మతతో బాధపడే వారి పరిస్థితి ఇదే. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వారి వారి సంఖ్య నానాటికి పెరిగిపోతోంది.. – రాజంపేట



రాజంపేటకు చెందిన జగదీశ్ అనే వ్యక్తి బెంగళూరులో కార్పొరేట్ కంపెనీలో ఉన్నతమైన హోదా ఉద్యోగం చేస్తున్నారు. మంచి జీతంతో జీవనం సాఫీగా గడిచిపోతోంది. అయితే ఇటీవల హెడ్ ఆఫీసుకు పంపాల్సిన ముఖ్యమైన మెయిల్స్, వివరాలు పంపకపోవడం , ముఖ్యమైన సమావేశాల తేదీలను గుర్తుపెట్టుకోవడంలేదు. దీంతో ఆయన మీటింగ్‌లకు సైతం వెళ్లలేని పరిస్థితి. ఇవన్నీ ఒక ఎత్తయితే తాను చెప్పిన మాటలు మరిచిపోయి, తోటి ఉద్యోగులతో గొడవలు పడుతుండటంతో సంస్థ నుంచి మోమోలు జారీ అయ్యాయి. దీంతో కంగుతిన్న ఆయన వెంటనే మానసిక వైద్యుడిని సంప్రదించారు. కొన్నేళ్లుగా ఆయన మధుమేహం మందులు సరిగా వాడకపోవడంతో వ్యాధి పూర్తిగా అదుపులేని కారణంగా మతిమరుపు వచ్చినట్లు డాక్టరు తెలిపారు.

- మధుమేహుల్లో 'మతి'మరుపు
- రక్తప్రసరణపై ప్రభావం చూపుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు
- నానాటికి పెరుగుతున్న మతిమరుపు బాధితులు

ఇలా ఒక్క జగదీశ్ మాత్రమే కాదు.. చాలామంది మధుమేహంతో బాధపడేవారు తాము మందులు వేసుకున్నా వేసుకోలేదని మళ్లీ వేసుకోవడం , లేకుంటే అసలే వేసుకోకపోవడం, వేసుకున్నట్లుగానే భావించడం వంటివి చేస్తున్నట్లు వైద్యుల అధ్యయనంలో తేలింది. ఇందుకు మతిమరుపే కారణమంటున్నారు. ఇప్పుడు మధుమేహుల్లో మతిమరుపు సమస్య ప్రధానంగా మారింది. ఇది జన్మతః వచ్చింది కాదు..కొన్నేళ్లుగా డయాబెటీస్ అదుపులో లేకపోవడంతో వచ్చిన సమస్య. ఈ ప్రభావం మందుల వాడకంపై చూపడంతో శరీరంలో షుగర్ లెవల్స్ పెరగడం, ఒక్కసారిగా తగ్గిపోవడం వంటివి చోటుచేసుకుంటూ ప్రమాదకర స్థాయికి చేరుకుంటోందని నిపుణులు చెబుతున్నారు.

మధుమేహం సోకి పదేళ్లు దాటితే..

మధుమేహం సోకి పదేళ్లు దాటిన వారిలో మతిమరుపు సమస్య ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో షుగర్ లెవల్స్ అదుపులో లేనివారికి ఐదేళ్లకి సమస్య వస్తున్నట్లు నిర్ధారించారు. మధుమేహులలో ఐదుశాతం మందిలో ఈ సమస్య ఉన్నట్లు అధ్యయనాల్లో తేలింది.

మతిమరుపు కారణంగానే..

మధుమేహం ఉన్న వారిలో మెదడకు మళ్లీ మైక్రోవాస్క్యులర్ రక్తనాళాలు సన్నబడటంతో రక్తప్రసరణ తగ్గుతుంది. దీంతో మెదడుకు సరైన రక్తప్రసరణ జరగకపోవడటంతో మతిమరుపు వస్తున్నట్లు వైద్యులు అంటున్నారు. అంతేగాకుండా శరీరంలో షుగర్ లెవల్స్ అదుపులో లేని వారిలో ఈ ప్రభావం మెదడుపై చూపి జ్ఞాపకశక్తిని కూడా దెబ్బతీస్తుందంటున్నారు. ఇలా దీర్ఘకాలం పాటు మందులు వాడే వారిలో ఇలాంటి లక్షణాలు ఎక్కువగా ఉంటున్నట్లు చెబుతున్నారు.

మధ్యవయస్కుల్లో లక్షణాలు పెనుముప్పు

ఒకప్పుడు 45 ఏళ్లు దాటిన వారిలో షుగర్ లక్షణాలు కనిపించేవి. ప్రస్తుతం ఇరవై..ముప్పై సంవత్సరాల వయస్సు వారు కూడా మధుమేహం బారిన పడుతున్నారు. దీంతో కొందరు సరిగ్గా మందులు వాడని పరిస్థితి నెలకొంది. అలాంటి వారిలో వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్యలో గుండెపోటు, మెదడుపోటుతోపాటు మతిమరుపు సమస్యలు వస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. పనిచేసే వయస్సులో ఇలాంటి సమస్యలు తలెత్తడం సమాజంపై పెనుముప్పుగా మారుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మారుతుంది

దీర్ఘకాలంగా మధుమేహం ఉన్న వారిలో మెదడుకు వెళ్లే రక్తనాళాలు సన్నబడటంతో రక్తప్రసరణతగ్గి మతిమరుపు వచ్చే అవకాశాలున్నాయి. మధుమేహ రోగుల్లో మతిమరుపు సమస్య ఒక్కో సమయంలో ప్రమాదకరంగా మారుతుంది. శరీరంలో షుగర్ లెవల్స్ పెరగడం, తగ్గడం వంటివి చోటుచేసుకుని మా వద్దకు వస్తుంటారు. ఇలాంటి వారిలో మధుమేహ దుష్ఫలితాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వారికి మందులు వేసే బాధ్యతను కుటుంబ సభ్యులే చూడాలి.



-డాక్టర్ శివారెడ్డి, మధుమేహ వ్యాధి నిపుణులు, కడప

తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్

నేడు 141వ వర్ధంతి

కడప కల్చరల్ : తెలుగు వారికి బ్రౌన్ ఆరాధనీయుడు. తెలుగు వారికి ప్రతిష్టాత్మకమైన ప్రబంధాలు, కావ్యాలు, పురాణ ఇతిహాసాలతోపాటు విశ్వకవిగా వేమనను కాలానికి విలువైన కానుకగా అందజేసిన మహనీయుడు. జీవితాన్ని తెలుగుభాషోద్ధరణకు అంకితం చేశాడు గనుకనే ఆయనంటే తెలుగు వారందరికీ ఆరాధన. తెలుగు వెలుగుకు విశేష కృషి చేసి తెలుగు సూర్యుడిగా వినుతికెక్కారు బ్రౌన్. గురువారం ఆయన 141వ వర్ధంతి. కడపలో ఆయన పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రౌన్ గురించి సాక్షి ప్రత్యేక కథనం.

▪ సీపీ బ్రౌన్ 1820 ఆగస్టులో జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉద్యోగ విధులు ప్రారంభించారు. 1824 నుంచి తెలుగు కావ్యాల అధ్యయనం ప్రారంభించి పట్టు సాధించారు. కడపకు వచ్చాకే ఆయనకు తెలుగుభాష గొప్పదనం తెలిసింది. ఈ క్రమంలో ఫ్రెంచ్ గురువు 'అబె దుబయ్' ద్వారా బ్రౌన్ వేమన గురించి ఆయన పద్యాల ఘనతను గురించి తెలుసుకుని మక్కువ పెంచుకున్నాడు. వేమన పద్యాలున్న తాళపత్రాలను సేకరించి స్వంత ఖర్చుతో 1215 పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారు. బ్రౌన్ లేకుంటే వేమన నేటి తరం తెలుగు వారికి దక్కేవారు కాదు. ఆయన పద్యాల్లోని తెలుగు పదాలకు అర్థాలు తెలుసుకునే క్రమంలో వాటిని మాలగా కూర్చే క్రమంలో బ్రౌన్ నిఘంటువు రూపుదాల్చింది. జిల్లాపై అభిమానంతో తొలుత దీనికి కడప నిఘంటువుగా పేరు పెట్టారు. తర్వాతే బ్రౌన్ నిఘంటువుగా మారింది. ఆయన కార్యస్థానం గనుక కడప అంటే ఆయనకు ఎనలేని మమకారం.

మానవతా వాది

బ్రౌన్ కడప నగరంలో రెండు, బందరులో రెండు, మద్రాసులోని ఎగ్మోర్‌లో ఒక పాఠశాల ఏర్పాటు చేశారు. తెలుగుతోపాటు ఉర్దూ, పార్శి నేర్చారు. మన జిల్లాలో ఓమారు 11 మంది దోషులకు రూ. 355 జరిమాన విధించగా తానే చెల్లించి వారిని విడుదల చేయించారు. ఒక ఉర్దూ మున్షి అప్పుల్లో ఉండగా రూ. 1000 చెల్లించి రుణ విముక్తుడిని చేశాడు. కరువు సమయాల్లో గంజి కేంద్రాలను ఏర్పాటు చేశాడు. ఆయన గుంటూరుకు బదిలీ అయ్యాక ఇక్కడ కరువు వచ్చిందని తెలిసి తన సహాయకుడు కృష్ణారెడ్డికి గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వికలాంగులు, అంధులు, నిరుపేదలు, అనాథలు, వృద్ధులకు ధర్మ భోజనం పేరుతో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. పూటకూళ్ల సత్రాలకు ప్రతినెలా తానే బిల్లు చెల్లించాడు. పాతకడప ప్రాంతంలో సతీ సహగమనం జరుగుతున్న విషయం తెలిసి కారకుడైన వ్యక్తిని బ్రౌన్ తన అదుపులో ఉంచుకున్నాడు. ఫలితంగా మృతదేహంతోపాటు ఆయన భార్యను కాల్చేయకుండా కాపాడగలిగారు.



కడపలో బ్రౌన్ పేరిట ఏర్పాటైన గ్రంథాలయం

బ్రౌన్ చిత్ర రూపకర్త

బ్రౌన్ చిత్రం అవసరాన్ని గుర్తించిన డాక్టర్ జానమద్ది ఆయన ఫోటో కోసం లండన్‌లో కూడా వెతికారు. అది లభించకపోవడంతో ప్రముఖ చిత్రకారుడు తన మిత్రుడు మైనంపాటి సుబ్రమణ్యం ద్వారా 1991లో బ్రౌన్ ఊహా చిత్రాన్ని రూపొందింపజేసి తెలుగు సాహితీ లోకానికి అపూర్వమైన కానుకగా అందజేశారు. ప్రస్తుతం బ్రౌన్‌గా ప్రచారంలో ఉన్నది లలిత కళానిధి మైనంపాటి గీసిన చిత్రమే! బ్రౌన్ గ్రంథాలయం వెలుపల గోడపై నేడు కనిపిస్తున్న బ్రౌన్ కుడ్య చిత్రం జిల్లాకు చెందిన చిత్ర, శిల్పకారుడు గొల్లపల్లి జయన్న రూపొందించారు. ఈ గ్రంథాలయమే రాష్ట్రంలో ఓ అపురూపమైన సరస్వతీ నిలయంగా పేరుగాంచింది.

నేడు 'బ్రౌన్' వర్ధంతి సభ

తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 141వ వర్ధంతి సభను గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఉదయం 9.40 గంటలకు రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి పూలమాల అలంకరిస్తామన్నారు. అనంతరం బ్రౌన్ గ్రంథాలయంలో జరగనున్న సభకు వైవీయూ ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారన్నారు.



బ్రౌన్ జీవితంలో ముఖ్య ఘట్టాలు

- 1798లో జన్మించారు.
- 1816లో మద్రాసు సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగిగా చేరారు.
- 1817 మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో తెలుగు అధ్యయనం ప్రారంభించారు.
- 1821 కడపలో తెలుగు, హిందూస్తానీలను ఉచితంగా బోధించేందుకు రెండు పాఠశాలలు ప్రారంభించారు.
- 1824 అబె దుబాయ్ రచన ద్వారా వేమన గురించి తెలుసుకున్నారు.
- 1828 కడపలో బంగ్లా కొన్నారు.
- 1829 వేమన పద్యాల ముద్రణ ప్రారంభించారు.
- 1844లో బ్రౌన్ నిఘంటువు ముద్రణ ప్రారంభం.
- 1854లో ఉద్యోగానికి రాజీనామా చేశారు.
- 1884లో వీలునామా రాశారు. అదే సంవత్సరం డిసెంబరు 12న ఆయన మరణించారు.

క్లుప్తంగా

నేడు ఒంటిమిట్టకు 'ఆకేపాటి' పాదయాత్ర

రాజంపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి 10వ సారి ఒంటిమిట్ట రామాలయానికి గురువారం పాదయాత్ర చేపట్టనున్నారు. ఉదయం 4గంటలకు ఆకేపాడు ఆలయాల సముదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5గంటల నుంచి పాదయాత్రగా బయలుదేరి 9.15 గంటలకు నందలూరు బస్టాండుకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 2గంటలకు నుంచి 3.30 నిమిషాలకు ఒంటిమిట్ట కోదండరామాలయానికి చేరుకుంటారు. కోదండరామునికి ప్రత్యేకపూజలు నిర్వహించి, తన గోవిందమాల దీక్షను విరమించనున్నారు. పాదయాత్రకు భక్తులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఆకేపాటి అనిల్‌రెడ్డి బుధవారం పిలుపునిచ్చారు.

చౌక బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం



చౌక బియ్యంలో వచ్చిన ప్లాస్టిక్ బియ్యం

బి.కొత్తకోట : ప్రభుత్వం సరఫరా చేస్తున్న చౌక బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ కోటాకు సంబంధించిన చౌక బియ్యాన్ని మండలమంతా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వీటిలో కోటావూరు పంచాయతీ కాండ్లమడుగు, అమరనారాయణపురంకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కనిపించాయి. బియ్యం నుంచి వీటిని వేరు చేసి నీటిలో పోయగా అవి తేలుతున్నాయని, పంటితో కొరికితే బంకలా ఉన్నాయని స్థానికులు చెప్పారు. ఈ ప్లాస్టిక్ బియ్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్య సమస్యలపై తల్లులకు అవగాహన



పిల్లలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం తల్లుల బాధ్యత అని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడరేవుపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సమస్యలు – శిశువుల సంరక్షణ అంశంపై తల్లులకు అవగాహన కల్పించారు. తేలికపాటి జ్వరంతో ఉన్న బిడ్డలకు చల్లగా, పొడిగా, విశ్రాంతిగా ఉంచడం ద్వారా మరింత సౌకర్యంతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీను, ఏఎన్ఎం షామున్నిసా, కృష్ణమ్మ, సీహెచ్‌ఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తా పడి నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. అంగళ్లుకు చెందిన ఫాతిమా(65) కురబలకోటకు చెందిన మహమ్మద్ (45), మహమ్మద్‌బాషా(43), గౌసియా(30) ఆటోలో మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో ఆటో ముందు టైరు పంక్చర్ కావడంతో టైర్‌పేలి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైతన్నకు అండగా ఉద్యమాలు

- 13న రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : కూటమి ప్రభుత్వంలో తీరని అన్యాయానికి గురైన అన్నదాతలకు అండగా నిలవాల్సిన అవసరం ఏర్పడిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అన్నదాతలకు అండగా నిలబడేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పోరుబాటకు పిలుపునిచ్చిన విషయాన్ని బుధవారం పత్రికలకు అందజేసిన ప్రకటన ద్వారా గుర్తు చేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కల్గించడమే లక్ష్యంగా ఈనెల 13వ తేదిన అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రైతులు పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం 10 గంటలకు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటలకు కూటమి ప్రభుత్వంలో మద్దతు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. జగన్ హయాంలో రైతులకు పెట్టుబడి సహాయం క్రింద ఏటా రూ. 13500 ఇచ్చేవారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంతకన్నా ఎక్కువగా రూ. 20 వేలు అందిస్తామని చెప్పి ఆ పథకాన్ని ఇప్పుడు అమలు చేయక రైతులను దగా చేస్తుందన్నారు. నాడు వైఎస్ జగన్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకుంటే నేడు చంద్రబాబు ఆ పథకానికి ఏకంగా ఎసరు పెట్టి బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించేలా చర్యలు తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. అమలుకాని హామీలతో ప్రజలను నమ్మించి అమలు చేయక వంచించిన కూటమి సర్కారుపై సమరకేతనం ఎగురవేయాలన్నారు. ఆరు నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. పింఛన్‌లో వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వడం మినహా ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదని తెలిపారు. విద్యుత్ చార్జీలను ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపారన్నారు. అమ్మఒడి (తల్లికివందనం), ఫీజు రీఎంబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందివ్వక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో పేదల జీవితాలు కష్టతరంగా మారాయన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ. 1 లక్షలు నుంచి రూ. 1.50 లక్షల వరకు బాకీలు పడ్డారన్నారు. ఈ బాకీలను ఎప్పుడు తీరుస్తారని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలోని రైతులకు మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 'రైతులకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 13న రాయచోటి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని వైఎస్సార్ సీపీ ప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై రైతులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ రమేష్, మందల నాగేంద్ర, మందల శివయ్య, గునిశెట్టి రమేష్, సుబ్బారెడ్డి, శంకరయ్య, నరసింహారెడ్డి, రాజగోపాల్, రహీమ్ ,ప్రసాద్ రెడ్డి, ఫరూక్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి



జిల్లా ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : రోగులపై నిర్లక్ష్యం వహిస్తూ, చికిత్స అందించకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు, స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేస్తూ కమిషన్లకు కక్కుర్తి పడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం సీపీఐ, ఏపీ స్టూడెంట్ జేఏసీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట వైద్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ గాయత్రి శ్రీశ్రీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ....మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే తదితరాలకు సంబంధించి వైద్యులు, ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల యజమానులతో కుమ్మక్కై పేదలను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రిలో స్కానింగ్ యంత్రాలు, సిబ్బంది ఉన్నప్పటికీ, ఇక్కడి కంటే ప్రైవేట్‌లో మెరుగైన ఫలితాలు వస్తాయని, రోగులను బెదిరించి మరీ ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వవైద్యులు సేవాదృక్పథంతో కాకుండా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఏకంగా ప్రైవేట్ ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల సిబ్బంది ముడుపులు నేరుగా జిల్లా ఆస్పత్రికే తీసుకువచ్చి డాక్టర్లకు పంపిణీ చేసి వెళుతున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్లపై కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. లంచాలు మరిగిన వైద్యులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మురళీ, ఐటీయూసీ కృష్ణమూర్తి, ఉత్తన్న, జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడిప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడేసిన మోటార్‌సైకిల్ వెలికితీత

మదనపల్లె : గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో పడవేసిన మోటార్‌సైకిల్‌ను స్థానికుల సహాయంతో తాలూకా పోలీసులు వెలికితీశారు.బుధవారం మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ బెస్తపల్లె సమీపంలోని చెరువులో ఓ ద్విచక్రవాహనం మునిగి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ద్విచక్రవాహనాన్ని వెలికితీశారు. అయితే వాహనానికి నెంబర్‌ప్లేట్ లేకపోవడంతో వాహనం ఎవరిదో తెలియలేదు. దీంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు ఎవరైనా ఉంటే తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. అయితే..ద్విచక్రవాహనం చెరువులో ఎవరు పడేశారో కారణాలు తెలియాల్సి ఉంది.

బొలేరో వాహనం ఢీ కొని రైతు మృతి




సూర్యనారాయణ(ఫైల్)

ములకలచెరువు : బొలేరో వాహనం ఢీ కొనడంతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ గోళ్లపల్లెకు చెందిన కె. సూర్యనారాయణ(58) పనుల మీద ములకలచెరువుకు వెళ్లాడు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా చెన్నెగారిపల్లె మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుడిని పోస్టుమార్టం నిమిత్త మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కిల్ డిజైర్ టెక్నాలజీస్‌తో వైవీయూ ఒప్పందం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థుల ప్రయోజనార్థం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదుర్చుకున్నారు. విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె. కృష్ణా రెడ్డి సమక్షంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ ముప్పాళ్ళ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారన్నారు. మద్రాస్ ఐఐటీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఆర్ట్స్ విద్యార్థులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు రూపకల్పన చేస్తామన్నారు. విద్యార్థులు వారి రెగ్యులర్ కోర్సులు అభ్యసిస్తూనే మిగిలిన సమయాల్లో స్కిల్ డిజైర్ సంస్థ ద్వారా ఉద్యోగ నైపుణ్య ఆధారిత శిక్షణను పొందవచ్చని వివరించారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఇది ప్రయోజనకరమని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్‌లు ఆచార్య ఏజీ దాము, కంకణాల గంగయ్య, నోడల్ ఆఫీసర్ డా.ఎస్.పి.వెంకటరమణ, ఎంసీఏ సహ ఆచార్యులు డా.బి.రెడ్డయ్య, డా.ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మదనపల్లె సిటీ : జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల రాయచోటిలో ఉపాధ్యాయుడు మృతి సంఘటన, మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు ఐఎఫ్‌పీ ప్యానల్ పగలగొట్టడం, పలు పాఠశాలల వద్ద అల్లరిమూకలు గొడవలు వంటి సంఘటనలతో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల సీసీ కెమెరాలు బిగించారు. కెమెరాల ఏర్పాటుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చేది, వెళ్లేది రికార్డు అవుతుంది.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ కె సతీష్ కుమార్ కుటుంబానికి రూ. 1.75 లక్షల చెక్కును అదనపు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో కొండూరు సతీష్ కుమార్ రాజు మృతి చెందాడు. ఆయన భార్య అఖిల భారతీకి విడోఫండ్ నుంచి రూ. 50 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి ఒక లక్ష కలిసి మొత్తం రూ. 1,75,000 చెక్కులను ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అందజేసినట్లు ఏఎస్పీ తెలియపరిచారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టు మెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవకుండా చూస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నిరభ్యంతరంగా తనను గానీ, జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ బి కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



మృతి చెందిన శివశంకర్

రామాపురం : కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయితీ పరిధిలోని డాల్ఫిన్ దాబా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని అశోక్ లైలాండ్ వాహనం ఢీ కొంది. గాయపడిన వీరపోగు శివశంకర్(19) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. హసనాపురం గ్రామ పంచాయితీ పప్పిరెడ్డిగారిపల్లె హరిజనవాడకు చెందిన శివశంకర్ రావులపాలెం నుంచి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలోని నల్లగుట్టపల్లె పంచాయితీ సమీపంలోని డాల్ఫిన్ దాబా వద్దకు రాగానే రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కేఏ 59 0743 గల అశోక్ లైలాండ్ వాహనం ఢీ కొంది. తీవ్ర గాయాలైన స్కూటరిస్టు శివశంకర్‌ను మండల పోలీసులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి మృతి కేసులో తనయుడి అరెస్ట్

పెద్దమండ్యం : కన్న తల్లిని రోకటిబండతో విచక్షణా రహితంగా దాడి చేసి ఆమె మృతికి కారణమైన కేసులో కొడుకును అరెస్ట్ చేసినట్లు బుధవారం ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. మండలంలోని సీ గొల్లపల్లెలో గత నెల 24న ఈ సంఘటన జరిగిన విషయం తెలిసిందే. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోడెం ఓబులమ్మకు ఇద్దరు కుమారులు. రెండవ కుమారుడు బోడెం ఓబులేసు వివాహితుడు. అయితే మనస్పర్థలు రావడంతో అతడి భార్య పిల్లలను తీసుకెళ్లి ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఓబులేసు తనతల్లి ఓబులమ్మ (70) వద్దనే ఉంటున్నాడు. ఇతనికి మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న ఓబులేసు తల్లిపై రోకటి బండతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమెను వైఎస్సార్ జిల్లా రిమ్స్, తిరుపతి రూయాలో చికిత్స చేయించుకుని రాగా ఇంటి వద్దనే మృతిచెందింది. తల్లిపై దాడి చేసిన ఓబులేసును పెద్దమండ్యం బస్టాప్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పివి రమణ, సిబ్బంది పి జె ఖాన్, కిరణ్, క్రిష్ణమూర్తి లు పాల్గొన్నారు.

ఏపీ శాక్స్ మాజీ పీడీపై విచారణకు ఆదేశం

మదనపల్లె : ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) మాజీ పీడీ రాజేంద్రకుమార్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులు అమరావతిలోని సచివాలయానికి వెళ్లారు. మాజీ పీడీ తమను వేధించారని పలువురు ఉద్యోగులు ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. దీంతో వైద్యశాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల ఎదుట విచారణకు రావాలని ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలోని ఐసీటీసీ, పీపీటీసీ, ఎస్‌టీఐ, ఏఆర్‌టీ కౌన్సిలర్లతో పాటు పలువురు ఉద్యోగులు విచారణకు రావాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర వ్యాప్తంగా 40 మందికి విచారణకు రావాలని ఉత్తర్వులు జారీ చేయగా అందులో మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి ఎనిమిది మంది ఉద్యోగులు ఉన్నారు.

మూతపడిన ఐసీటీసీ,ఎస్‌టీఐ విభాగాలు:
విచారణ నిమిత్తం ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులు అమరావతికి వెళ్లడంతో బుధవారం ఐసీటీసీ,పీపీటీసీ, ఎస్‌టీఐ విభాగాలు మూతపడ్డాయి. ఏఆర్‌టీలో కౌన్సిలర్లతో పాటు పలువురు ఉద్యోగులు కూడా వెళ్లడంతో ఒకరిద్దరితో ఏఆర్‌టీ నడిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నందలూరు : మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లి గ్రామం, సర్వే నెంబరు 293లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు బుధవారం కొంతమంది ప్రయత్నించారు. హైకోర్టు ఆర్డర్ అందంటూ జేసీబీ యంత్రాలతో ప్రభుత్వ భూమిలో చెట్లను తొలగించడం మొదలు పెట్టారు. అడ్డుకున్న వీఆర్‌ఏలను కబ్జాదారులు బెదిరించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ అమర్నాథ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో కబ్జాదారులు తమ వాహనాలతో సహా పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అలవాటులేని ఆహారంతోనే విద్యార్థులకు అస్వస్థత

ట్రిపుల్ ఐటీని సందర్శించిన అధికారులు



ట్రిపుల్ ఐటీ అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ కాలేదని, అలవాటులేని ఆహారం తినడంవలనే కొంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ చిన్నయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని పత్రికల్లో రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను బుధవారం జిల్లా ఆరోగ్య శాఖ వైద్యాధికారి నాగరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత, ఇన్‌చార్జి ఆర్డీఓ చిన్నయ్య సందర్శించారు. అలాగే ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉన్న ఆసుపత్రికి వెళ్లి గత 5 రోజులుగా జరిగిన ఓపీకి చెందిన రికార్డులను పరిశీలించి అక్కడ ఉన్న వైద్యులు ప్రభాకర్ రెడ్డి, సంతోష్ కుమార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఒంగోలు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల విద్యార్థులను కూడా కలిసి భోజనానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు ఆహారంలో ఎలాంటి కలుషితం కాలేదన్నారు. గత 5రోజులుగా 33 మంది విద్యార్థులు వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చారన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్న ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులు 24 గంటలు పని చేస్తున్నారన్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులకు ఇక్కడి ఆహారం, వంట పడకపోవడంతోపాటు కడప మసాలాలతో మాకు ఎక్కువగా వాంతులు చేసుకున్నట్లు విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. కార్యక్రమంలోతహసీల్దార్ హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర రాజు, డాక్టర్ ఖాజా మొహిద్దీన్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో మనిషి జీవితం ఆదర్శం

- గీతా జయంతి సందర్భంగా సరస్వతి మాతాజీ
- రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



భగవద్గీత పఠన పోటీల్లో విద్యార్థులు

ప్రొద్దుటూరు : భగవద్గీత పఠనం ద్వారా మనిషి జీవితం ఆదర్శవంతవుతుందని స్థానిక శ్రీశిదదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు పూజ్య స్వామిని సరస్వతి మాతాజీ తెలిపారు. పెన్నానది తీరంలోని త్యాగరాజ కల్యాణ మండపంలో బుధవారం గీతా జయంతిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి భగవద్గీత మొదటి అధ్యాయంలోని అర్జున విషాద యోగ పఠన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ భగవద్గీత పుస్తకం అందరికి అందాలన్నదే ప్రథమ సంకల్పమని అన్నారు. గీతా జ్ఞానం మన కుటుంబ సభ్యులందరికి అందించాలని సూచించారు. భగవద్గీత పోటీల ద్వారా విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా మనషి జీవితం ఆదర్శం కావడానికిఇ పునాదులు ఏర్పడుతాయని తెలిపారు. మనిషి ఆదర్శవంతమైన, ఆనందవంతమైన జీవితానికి కావాల్సిన జ్ఞానాన్ని అర్జునుల ద్వారా మనకు అందించారన్నారు.

1000 మందితో భగవద్గీత పారాయణం

కల్యాణ మండపం ఆవరణలో దాదాపు 1000 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ట్రస్టు భక్తులు కలసి భగవద్గీత మొదటి అధ్యాయం పారాయణం చేశారు. ఈ కార్యక్రమం అందరినీ అలరించింది. అనంతరం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాతాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

విజేతలకు బహుమతులు

భగవద్గీత పఠన పోటీల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు జోనల్ స్థాయిలో, జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థు లకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలకు సంబంధించి గ్రూప్-ఏలో టి.జితిన్, తుషారిక, గ్రూప్-బీలో జి.త్రిషిత, ఆర్.ధన్విత, గ్రూప్-సీలో ఎం.మానస, సి.సంతోష్, గ్రూప్-డీలో ఎస్.వెంకటజయశ్రీ, వై.శ్రీ భావన విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.6 వేల నగదు బహుమతి, మెమెంటో, మెడల్ అందించారు.

ఆర్టీసీ కానిస్టేబుల్ ఔదార్యం



వృద్ధుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి

కడప అర్బన్ : సమాజంలో నిత్యం మనం వెళుతున్న దారిలో అనేక సంఘటనలు చూస్తుంటాం. కొందరు అయ్యో పాపం అంటే, కొందరు చూసీచూడనట్లుగా వెళుతుంటారు. కానీ ఆ ఆర్టీసి విజిలెన్స్ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఓ వృద్ధుడికి సేవ చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. కడప ఆర్టీసీ బస్టాండ్ స్కూటర్ స్టాండ్‌లో ఖాజీపేట మండలం తవ్వారుపల్లికి చెందిన లక్ష్మిరెడ్డి (75) అనారోగ్యం, గాయాలతో అస్వస్థతతో పడివుండటంతో గమనించాడు. తనతో పాటు పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, సిబ్బంది సుబ్బరాయుడు, మధు నాయక్, లక్ష్మిరెడ్డిలతో కలిసి వృద్ధుడికి స్నానం చేసి, ఆహారం తినిపించారు. అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఇందుకోసం గౌస్ కమ్యూనికేషన్స్ యజమాని కమాల్ బాషా తమ వంతుగా సహరించారు. ఈ దృశ్యాలను చూసి అందరూ వారిని మెచ్చుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

ASTROLOGY

■ శ్రీ దుర్గ దేవి జ్యోతిష్యాలయం : పం॥ వి. శంకర రావు శాస్త్రి గారు మీ హస్తరేఖ సాముద్రికం, జాతకం చూసి మీ సంపూర్ణ భవిష్యత్ చెప్పబడును. ఉద్యోగం, సంతానం, స్త్రీ ప్రేమ, వివాహం ఎటువంటి సమస్యలు ఉన్న 5 రో॥ పరిష్కారం ఫోన్ ద్వారా చూపబడును. ఫోన్ : 91102 35188

WANTED

■ ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు డాక్టర్స్ మరియు నర్సింగ్ స్టాఫ్ కావలెను. జనరల్ మెడిసిన్ -1, గైనకాలజీ -1 (బీఎస్సీ నర్సింగ్ / జి ఎన్ ఎమ్) సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9014 159658

■ Universal యాడ్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 6000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNCకంపెనీలో వర్క్‌ఫ్రంహోం సదుపాయంతో స్త్రీ పురుషులు కావలెను. Qul-10th, డిగ్రీ మంచి జీతం ఉచిత రూముభోజనసదుపాయం.8073902428,9110475386

■ కడప ఇండస్ట్రియల్ ఏరియాలోని మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8గంటల డ్యూటీ, జీతం: 9,000+ESI, PF. సంప్రదించండి: 85559 52208, 91829 64173.

■ కస్టబట్టీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు.ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం.జీ: 18K. Ph: 9640400073, 9160900024

■ స్పాట్ జాయినింగ్ (Only for females). మా ఆఫీసు నందు టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్ ,కౌన్సిలర్స్, PRO'S కావలెను. Q:SSC-Degree. Age:20-40. జీ:20K to 25K. ✆ 9885122224.

■ మార్కెటింగ్ మేనేజర్లు కావలెను. ఆకర్షణీయమైన ప్యాకేజీ, పెన్షన్ సదుపాయం, దేశ, విదేశీ యాత్రలు, ప్రమాద బీమా, కారు, విల్లా వంటి అవకాశాలకు ఫోన్ చేయండి. సెల్: 82475 04682

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... ప్రకటనదారులు తెలిపే టోల్ ఫ్రీ ... సంబంధం లేదు. ... చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409